## ముషీరాబాద్‌లో మరో 3 నామినేషన్లు

కవాడిగూడ, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం 3 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. లక్ష్మీనారాయణ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్ యాదవ్ నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థి ఎస్. రవి, జై మహాభారత్ పార్టీ అభ్యర్థి హేమలత నామినేషన్లను దాఖలు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ముషీరాబాద్‌లో 7 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన విలేకరులకు వెల్లడించారు.

## అభివృద్ధిని చూడలేని కబోది పవన్‌కళ్యాణ్

● తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పీ. గోవర్ధన్‌రెడ్డి



కవాడిగూడ, నవంబర్ 8: తెలంగాణ వస్తే వారం రోజులు అన్నం ముట్టలేదన్న సినీ హీరో పవన్‌కళ్యాణ్‌కు తెలంగాణలో తిరిగే నైతిక హక్కు లేదని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కవాడిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని, బీజేపీ పాలిత సీఎంలు, కేంద్ర మంత్రులు స్వయంగా తెలంగాణ సంక్షేమ పథకాలను మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేశారు. కండ్లుండి చూడలేని కబోది పవన్‌కళ్యాణ్ అని ఆయన మండిపడ్డారు. వివిధ నినాదాలతో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, ఇందులో ఒక్కటి కూడి అమలు కాలేదని పవన్‌కళ్యాణ్ అనడం అత్యంత సిగ్గు చేటని అన్నారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి పవన్‌కళ్యాణ్‌కు కనబడలేదా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు ఇక్కడ తిరగనివ్వరని ఆయన హెచ్చరించారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలని ప్రధాని మోదీకి వినతి

కవాడిగూడ, నవంబర్ 8: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజర్వేషన్లు కల్పించి, కేంద్ర క్యాబినేట్‌లో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీకి మంగళవారం బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశా చారి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం దోమలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ జనాభాలో 50 కోట్లకు పైగా ఉన్న బీసీల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. బీసీల జనగణన చేపట్టాలని మోదీకి విన్నవించినట్లు చెప్పారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు సాయిని వెంకటేశం మృతి



సాయిని వెంకటేశం(ఫైల్)

అంబర్‌పేట, నవంబర్ 8 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది సాయిని వెంకటేశం(94) బుధవారం తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయన్ను కుటుంబసభ్యులు విద్యానగర్‌లోని శారదాంబ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతికి పద్మశాలి సంఘం నేతలు సంతాపం తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, సీనియర్ న్యాయవాది వనం విశ్వనాథ్, వనం దుశ్యంతల, అంబర్‌పేట నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు వీ. కృష్ణ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పద్మశాలి సంఘాలకు తీరనిలోటు అని కొనియాడారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,నవంబర్ 8: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-2 చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ బుధవారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు కాకి రంగు చొక్కా, తెల్ల ప్యాంట్ ధరించి, 5.4 అడుగుల ఎత్తు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అభివృద్ధి చేసినం.. ఆదరించండి

● బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను గెలిపించాలని మంత్రి తలసాని ప్రచారం



గంగపుత్ర కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు పూలమాల వేసి సత్కరించిన మహిళ, చిత్రంలో మంత్రి తలసాని, ముఠా జయసింహ

ముషీరాబాద్, నవంబర్ 8: ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రజల మధ్య ఉండి, వారి సమస్యల పరిష్కారానికి తపించే నాయకుడు ఎవరో, పనికి రాని వారు ఎవరో గమనించి ఓట్లు వేయాలని కోరారు. బుధవారం మంత్రి బీఆర్ఎస్ పార్టీ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని ఎంసీహెచ్ క్వార్టర్స్, గంగపుత్ర కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. స్థానికుడైన ముఠా గోపాల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని, తద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి ముందుకు సాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు, పింఛన్లు ఇచ్చి ఆదుకుంపన్నారని, లబ్ధిదారులంతా బీఆర్ఎస్‌కు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి బస్తీ, ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకం కింద లబ్ధిపొందిన వారు ఉన్నారని, వారంతా అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పాలనలో దళితులు, మైనారిటీలు పూర్తిగా విస్మరించబడ్డారని వారిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేశారని ఆయన ఆరోపించారు.


కాంగ్రెస్ పాలనలో వేసవిలో నగరంలో కరెంటు కోతలు, మంచినీళ్ల కోసం ఖాళీ బిందెల ప్రదర్శనలు ఉండేవని, కేసీఆర్ సీఎం అయిన తరువాత ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ, పరిశ్రమల స్థాపనలో దేశంలోనే మొదటి స్థానంలో దూసుకుపోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయని, హైదరాబాద్‌ను ఐటీ రంగంలో మొదటి స్థానంలో నిలిపిన తీరును గమనించిన విద్యావంతులు, మేధావులు బీఆర్ఎస్‌కు బాసటగా నిలవాలని కోరారు. అన్ని వర్గాల హితం కోరేలా రూపొందించిన బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం కల్పించాల్సిందిగా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, టి.సోమసుందర్, హరిబాబు యాదవ్, నరర్సింగ్ ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, టెంట్ హౌస్ శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రగతిని చూసి ఓటేయ్యండి.. : మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

గత తొమ్మిదన్నర ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఆయన ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు మద్దతుగా అడిక్‌మెట్ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బస్తీలు, కాలనీల్లో ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను గమనించి ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో మరోమారు ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలని, తెలంగాణ ప్రజా హితం, అభివృద్దే లక్ష్యంగా పని చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, గోపి, కార్తిక్‌యాదవ్, వీరాస్వామి, శ్యామ్, రమేశ్, బాలయ్య, సత్యనారాయణ, సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

### గాంధీనగర్‌లో జోరుగా ప్రచారం

**చిక్కడపల్లి :** బీఆర్ఎస్ పార్టీ ప్రచారం గాంధీనగర్‌లో డివిజన్‌లో జోరుగా కొనసాగుతుంది. బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ మాన్యిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజలు నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ భారీ విజయం ఖాయమన్నారు. నాయకులు పీఎస్ శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, రవి శంకర్‌గుప్తా పాల్గొన్నారు.




అడిక్‌మెట్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి



జవహర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్

# ముషీరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేయాలి

● బీఆర్ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర కోక



భోలక్‌పూర్‌లో మాట్లాడుతున్న రవీంద్ర కోక, తదితరులు

కవాడిగూడ, నవంబర్ 8: ముషీరాబాద్‌లో గులాబీ జెండాను ఎగురవేయాలని బీఆర్ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర కోక, మైనారిటీ విభాగం సీనియర్ నాయకుడు జునేద్ బాగ్దాది కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ జగన్, ఆంజనేయులు, ప్రవీణ్, రాజేశ్, కిరణ్‌కుమార్, రాముగౌడ్,శ్యామ్, భరత్, బాషా, మహ్మద్‌గౌస్, అఖిల్ హుస్సేన్ పాల్గొన్నారు.


**IN THE COURT OF JUNIOR CIVIL JUDGE CHEVELLA, R.R. DISTRICT AT : CHEVELLA**

**O.S.No.98 OF 2022**

Between:
Smt. Burrakayala Jayamma ...PLAINTIFF
Vs.
Bantu Bhagya Latha and others ...DEFENDANTS

**To,**
**(D-26)**-Gazi Salauddin,
S/o. late Md.Sardar Uddin,
Aged about 67 Years, R/o Flat No.102,
Harmony Apartment, Street No. 19,
Himayath Nagar, Hyderabad.

Sir,

Please take Summons that the above-named Plaintiff has instituted a civil suit against you for Partition and Separate Possession of plaint Schedule described agricultural land bearing Sy.No.321 Adm. Ac.3-31 guntas situated at Murthujaguda village, Moinabad Mandal, R.R.District. The above case is posted on 14-11-2023 for your appearance.
Therefore make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned Court at 10.30 A.M. on 14-11-2023. Otherwise the matter will be decided in exparte.

**(BY ORDER OF THE COURT)**

**Sd/- M. Penta Reddy, Advocate**
COUNSEL FOR PLAINTIFF
Plot No. 258,
Prashanth Nagar Colony,
Bandlaguda Jagir (V)
Rajendra Nagar (M) R.R. Dist.
Cell: 9848096495